

# అపరిచిత

అప్పటికే వీధి దీపాలు వెలుగుతున్నాయి ఈ దినం కాస్త ఆలస్యం అయింది అనుకున్నాను. సనాతనకాల రాజ్యవైభవాన్ని అప్పటికీ ప్రస్ఫుటిత పరిచే శిథిల శిలపై కూర్చుని హంపీ శిలా విగ్రహాలను చిత్రించటం, ఎంత సొగసైన అనుభవం ! ఆ అనుభూతిలో కాలాగతి సైతం తెలియలేదు. సాయం సమయ సూర్యభగవానుని పసిడి కిరణాల కాంతిలో, తమ నెలవులకై వెడున్న పక్షుల కలకలా రావములతో ప్రకృతి చూడముచ్చటగా ఉన్నది

మూడు వంతులు పూర్తి గావింప బడిన చిత్రపటం నాచేతి సంచిలో

# విద్యార్థుల చిన్న కథల పోటీలో బహుమతి పొందిన కథ

వ్రేలాడుతున్నది. ఎడమ చేతిలో ఇంపీరియల్ సైజు డ్రాయింగ్ బోర్డు, సంచి రంగులపెట్టె, కుంచెలు, నీటికై ఉపయోగించే సీసా, చిత్తు కాగితాలూ - కొండదిగివచ్చి ఏదో స్పేర్‌బస్ అందుకుని హొస్పేటు చేరేప్పటికి ప్రొద్దుపోయింది.

నే బసచేసిన హోటలు బస్టాండుకు దగ్గరగానే ఉంది. మూడవ అంతస్తులో ఆఖరిగది.

పోయిన తక్షణం కాస్సేపు విశ్రాంతి తీసుకోవాలి. ఆ తరువాత చిత్ర పరిసమాప్తి. పిమ్మట భోజనం. హోటల్ వాళ్ళు తమ పనితనమంతా చూపించి, అనవసరంగా హెచ్చించిన మేడ మెట్ల సంఖ్య ఎంతో చూడాలనిపించి, ఒక్కొక్కటే లెక్కిస్తూ పైకి వెళ్ళటం ఈ మూడురోజుల నుండీ జరుగుతున్న నిత్యకృత్యం. కాని మధ్యలోనే ఏదో ఆలోచించటం లేక ఎవరికైనా "డాష్" ఇవటం లాంటివి జరగటం, నా లెక్క పొలుపోటంకూడా పరిపాటయింది. రివాజుగా లెక్కిస్తూ మూడవ అంతస్తు సమీపిస్తుండగానే.. రవి ఎదురయ్యాడు. అదే హోటల్ కుర్రాడు. నన్ను చూడగానే సుపరిచితమైన ఒక చిరునవ్వు విసిరాడు.

"ఈదినం హంపీ వెళ్ళారాసార్?" మా వాడి మొదటి ప్రశ్న.

"అవును బాబూ" అన్నాను.

వాడి చూపులు అప్పుడే సంచిలోని డ్రాయింగ్ పేపరుపై ఉన్నాయి.

"ఏం వ్రాశారు? చూపిస్తారా?" అన్నాడు.

"ఇప్పుడొద్దు. రేపు ప్రొద్దుటే చూద్దువుగానీలే" అని నారూముకేసి నడిచాను.

స్విచ్ ఆన్‌చేసి, బోర్డును గోడవారగా ఉంచి, సంచిని టేబుల్‌పై పెట్టి, ఒక్క ఉదుటున వెళ్ళి మంచంపై పడ్డాను.

ఒక్క నిమిషం...

తలుపుపై వేళ్ళతో కొట్టిన టక్ శబ్దం. కాస్త వినగ్గానే - "ఎవరది?" అన్నాను.

అదే రవిగాడి గొంతు.

"నే నే సాబ్... లోపలికిరావాలా?" అన్నాడు.

వీడొకడు జిడ్డిగా పట్టుకున్నాడు. ప్రొద్దున చూపిస్తానోబాబో అని మొత్తుకున్నా మళ్ళీ వచ్చాడు.

"రావోయ్! ప్రొద్దున రమ్మని

చెప్పలా?' అన్నాను. లోపలికొస్తూ వాడు నా కంఠంలోని అసహనాన్ని గుర్తించి తక్కాడు

'అందుకోసం కాదుసార్ నేను రావటం' అన్నాడు.

'మరి ...?' ఇంకా కంఠంలో అసహనం ఉట్టిపడుతూనే ఉంది.

'మధ్యాహ్నం, మీకోసం ఎవరో వచ్చారు... మీరు రాత్రికిగాని రారని చెప్పాను... వచ్చిన తరువాత తెలుపమన్నారు అప్పుడే చెప్పాల్సింది మరిచాను సార్. ఇప్పుడు జ్ఞాపకంవచ్చి.. '

నా కాశ్చర్యమైంది. నన్ను చూడ్డానికెవరు వచ్చివుంటారు చెప్మా. ఈ ఊళ్ళో నాకెవరూ పరిచయస్తులుగానీ, స్నేహితులుగానీ లేరు బంధువులంతకంటే లేరు. అంతలో ఆ నూతన వధూవరులజంట జ్ఞాపకానికి వచ్చింది.

మొన్న కొండపైనుండి డామ్ దృశ్యాన్ని చిత్రిస్తున్నపుడు వారి పరిచయమైంది.

అతడు ఆర్ట్స్ కాలేజీలో లెక్చరర్ట. పేరు భూపాల్ ... అహా హా భోపాల్ ... వూా ... ఏదో ఒకటి మట్టిగడ్డ నవదంపతులట. ఆ అమ్మాయి మాత్రం అందంగా ఉంది- పేరు ... పేరు కూడా ఎంతో ముద్దుగా వుంది - కౌముదీట.

ఆ దంపతు లిరువురూ ఇంకా స్థూలాకృతి మాత్రమే దాల్చిన చిత్రాన్ని చూచి ఆకర్షితులై, వారే ముందుగా నన్ను పరిచయం చేసుకొన్నారు.

ఆ అమ్మాయి ఎంతో కుతూహలంగా పెయింటింగ్ గూర్చి నీవేవోరకరకాల ప్రశ్నలు వేసింది. నన్ను తమ ఇంటికి అహ్వానించారు. నా అడ్రసు కూడా తీసుకున్నారు.

నేను మెడిసిన్ చదువుతున్నానని చిత్రలేఖనకై, వివిధ, అపూర్వ దృశ్యములకై వచ్చానని, మా కాలేజి ఎగ్జిబిషన్ అరు పోటీలలో ప్రథమబహుమతి సంపాదించాలన్న ఉద్దేశ్యంతో ఇక్కడికి వచ్చానని చెప్పినపుడు -

'అందుకోసం ఇక్కడికి వచ్చారా...?' అని ఆ అమ్మాయి చాలా ఆశ్చర్యపడింది..

క్రొత్తమోడల్ చీర, చేతులు లేని బ్లౌజు ఎత్తికట్టిన కేశాలంకరణ- అబ్బ! చాలా అందంగా ఉంది.

ఆయనే -- అదే ఆ లెక్చరర్ వచ్చి ఉంటాడు.

'తెలగా పొడుగ్గా ... ఉన్నారు- మధ్యాపాపిట... వెంట్రుకలను వెనక్కి దువ్వారు. సన్నని మీసకట్టు. ఔనా ...' అన్నాను కుతూహలంగా వానివైపు చూస్తూ-

యు. జి. రఘువీర్

పి పి సి (మెడిసిన్)

మైసూరు మెడికల్ కాలేజ్,

మైసూరు

"మిస్ ...? అని, అగి ఏక వేళ నవ్వటం మొదలెట్టాడు వెధవ.

"ఎందుకోయ్ అంత నవ్వు?" అన్నా కాస్త దబాయింపుగా.

వాడు నవ్వాపుకుంటూ "వచ్చింది మగవారు కాదు సార్ – లేడీసు—" అన్నప్పుడు, నాకింకా ఆశ్చర్యమేసింది.

అలాగైతే – కౌముదే వచ్చిందేమో ...?

"వారెలా ఉంటారో చెప్తావా?" అన్నాను.

వాడు ఏం చెప్పాలా అని కాస్సేపు ఆలోచించాడు. తరువాత తలపై చేతులుంచుకొని–

"నే నంత పరీక్షగా చూళ్ళేదు సార్ ... అయినా తెల్లగా, పొడుగ్గా ..."

(ఐతే ఆమే అయి ఉండాలి. లెక్చెరర్ భార్య కౌముది) "కాస్త వయస్సయింది కదూ... తల నెరిసింది..." విషయం రాబట్టాలన్న ఊహతో అలా అన్నాను.

"ఐతే అయి ఉండొచ్చుసార్! నేను సరిగా చూళ్ళేదు. వస్తాసార్. క్రింద మేనేజర్ వీగ్ర వాయిస్తారు" అంటూ రవిగాడు వెళ్ళిపోయినప్పుడు కాస్త విసుగనిపించింది.

భోజనం చేసేప్పుడు కూడా అదే యోచన. ఎవరై ఉంటారబ్బా? ఎవరై ఉంటారాని?

భోజనానంతరం డ్రాయింగ్ పేపరును బోర్డుపైఉంచి, పిన్నులుగుచ్చి– ప్చ్... ఎవరై ఉంటుందామె? కుంచె పట్టుకొని కూర్చున్నా, ఎందుకో "మూడ్" రాలేదు. రంగుల పెట్టె మూసిపెట్టి మంచంపై వాలాను.

కౌముదే అయి ఉంటుందని ఎందుకో మనసులో దృఢమయిన నమ్మకం కలిగింది.

ఎందుకొచ్చింది, ఒక్కర్తే...? తమ ఆహ్వానాన్ని జ్ఞాపకం చేయటానికి వచ్చి ఉంటుందా? లేక...?


ఆ రూపు..., అలంకరణ... మాటిమాటికి కంటికి కట్టినట్లు అగుపించసాగింది.

ఎప్పుడు నిద్రపట్టిందో, లైటు అలాగే వెలుగుతోంది. లేచేప్పటికి తలభారంగా ఉంది. లేచి, లైటు ఆర్పేశాను.

నిన్నటిరాత్రి రవిమాటలు మళ్ళీ మదిలో ఒక్కసారి మెదిలాయి. నవ్వొచ్చింది. ఎవరో ఏమో? నేనెందుకు తల పాడు చేసుకోవాలి? ఆ యోచన విడవటానికి ప్రయత్నించాను.

స్నానం, ఫలహారం పూర్తిచేసుకొని, దినపత్రిక చదువుతూ వసారాలో కూర్చున్నా. ఈ రోజు చక్కెర ఫ్యాక్టరీ చూడాలనుకొన్నాను. కాని ఏదో సోమరితనం.

నిన్న వచ్చిన అమ్మాయి. మళ్ళీ ఈ దినమెందుకు రాకూడదు? భోజనాల వేళైంది. భోజనమూ అయింది. భోజనానికి వెళ్ళేటప్పుడు తలుపులు వారగా వేసి వెళ్ళాను. లాక్ చేయలేదు. ఒకవేళ ఆమె వస్తే




లోపల కూర్చోవచ్చు కదా అని.
ఉహూ...ఎవ్వరూ రాలేదు.

మధ్యాహ్నం విసుగనిపించింది. కాని నిన్న ఆమె ఇదే వేళకే వచ్చింది! ఏమైనా అవనీ. చిత్రం వేస్తూ కూర్చుంటే సరి. కాలం వేగంగా నడుస్తుంది. కుంచె పట్టుకొని కూర్చున్నాను.

చిత్రంకూడా ముగిసింది ఎవరూ రాలేదు. విసుగు ఎక్కువైంది.

ఏదో టాకీసులో "సుమంగళి" సినిమా ఉందని వాల్ పోస్టర్సు చూశాను. చూసిన సినిమా అయినప్పటికీ ఇంకొకసారి చూడాలనిపించింది. ముందువెనక చూడకుండా పిక్చర్‌కి వెళ్ళాను.

మొదటి ఆట వదిలేటప్పటికి తొమ్మిదిన్నర అయింది. మా రవిగాడు నన్ను తలుపు దగ్గర చూడగానే ఒక్క ఉదుటున నా దగ్గరికి వచ్చి–

"ఏంసార్...ఎక్కడికి పోయారు మీరు? మళ్ళీ వచ్చి పోయిందామె. పాపం!..."

గుండె గుభేలు మంది. ఎంత అన్యాయం జరిగింది! చేతికి చిక్కిన ముద్ద, నోటి కందనట్లైంది పని. సినిమాకు పోకుండావుంటే ఎవరో ఆ అమ్మాయి బయటు పడిపోయేది గదా అని అనుకొన్నాను.

రాత్రి రవిని పిలిచి ఓ మూల కూర్చోబెట్టుకొని–

"ఒరే రవీ! నా కోసం ఎవరో వచ్చారన్నావ్. ఎవరై ఉంటారబ్బా? వారెలా ఉంటారో నీవు కాస్త నిదానంగా తెలియపరిచితే, నేను తెలుసుకోగలను" అన్నాను మెత్తగా.

41 "ఓహో...అదా...?" అన్నాడు వాడు.

అబ్బ...జాణ ... "నిదానంగా, విపులంగా తెలుపు. రేపు సినిమాకి వెళ్దాంగాని...!" అన్నాను.

"అదే సార్, చెప్పాను గా "లేడీస్" అని! కాని మీరు చెప్పి నట్లు వారు ముదుసలి కాదుసార్! ఇంకా యంగూ! ఈ దినం బాగా చూశాను.

తెల్లగా, పలచగా, పొడుగ్గా... పచ్చచీర కట్టారు. రెండు జడలు... హూ... ఒకటి.

ఎడమచేతికి వాచీ... చాలా సేపు మా రూముకెదురుగా నిల్చున్నారు."


"ఊఁ ఊ!" అని ఉత్సాహ పరిచాను నేనూ ఉత్సాహంతో.

"ఈ రూములో ఉన్నవారు ఎప్పు డొస్తారు అని అడిగారు. ఇప్పటి వరకూ ఉన్నారండీ! ... ఇప్పుడే ఎళ్ళి పోయారులాగుంది అన్నాను."

"ఊఁ" నా కుతూహలం తీవ్ర తరమై పోతోంది.

"నిన్న కలవలేదు. ఈ దినం వచ్చినా లేరు" అన్నారు వారు.

"నేను అనుమానంగా వారు

A DEPENDABLE NAME ZANDU IN HOUSE HOLD REMEDIES
జండు ఫార్మస్యూటికల్ వర్క్స్ లిమిటెడ్, బొంబాయి-25.
3 brothers/TE

మీకు తెలుసా అని అడిగాను"— అని ఆగాడు రవి.

"హూఁ తరువాత... తరువాత?" అని నేను కుర్చీముందుకు జరిగి ఉత్సాహంగా అడిగాను.

"దానికి వారు 'నా స్నేహితులు' అని చెప్పారు సార్! చాలాసేపు మంచున్నారేమో, మళ్ళీ నేను పైకి వచ్చేప్పటికి వారు వెళ్ళిపోయారు" అని ముగించాడు వాడు.

"ఛీ!...ఛీ!!..." అని తలకొట్టుకున్నాను.

వరండాలో ఆఅమ్మాయినిల్చున్న స్థలాన్ని చూపించి వెళ్ళిపోయాడు రవి. నేను చాలాసేపు అక్కడనే నిలుచుండిపోయాను.

ఆ రాత్రి కూడా నిద్ర చాలా సేపటిక్కాని పట్టిందికాదు ఆ 'అపరిచిత' కలలో కూడా వచ్చి ఎదురుగా నిల్చున్నట్లు జ్ఞాపకం.

వరుసగా రెండు దినాలు వచ్చినమ్మాయి ఈ దినం కూడా రాకమానదు అని నా నమ్మకం. హెూటల్ వదలివెళ్ళరాదని, ఏదో నవల పుచ్చుకుని, రూములో నే కూర్చుండిపోయాను.

మధ్యాహ్నమైంది, సాయంకాలమైంది, రాత్రికూడా అయింది. నిద్ర ముంచుకొచ్చింది, కాని ఆ 'అపరిచిత' రాలేదు.

నాలుగవ దినం.

ఉదయం కాఫీ తాగుతుండగా— ఎలాగూ కౌముది ఇంటి అడ్రసు తెలుసు. ఎందుకు పోయి అనుమానం తీర్చుకోరాదు అనుకొన్నా.

అనుకొన్నదే ఆలస్యం, సెలూన్‌కు పోయివచ్చి, నీటుగా తలదువ్వుకొని, పైజమా, జుబ్బాం ధరించి— ఎందుకో మనసొప్పలేదు— జుబ్బా, పైజమా వదలి, ప్యాంట్, షర్టు టక్‌ చేసుకొని బయల్దేరాను.

కనీసం హెూటలుకు మూడు మైళ్ళదూరం ఉంటుంది వారి ఇల్లు. ఇల్లు తెలుసుకోవటం పేమంత కష్టం కాలేదు. లెక్చెరర్ వరండాలో కూర్చొని ఏదో పుస్తకం చదువుతున్నారు కాంపౌండు గేటు శబ్దం కావటంతో తలఎత్తి నన్ను చూశారు. వారికి చాలా ఆశ్చర్యమూ, సంతోషమూ అయింది.

"హల్లో! రండి, రండి..." అని లోపలికి దారితీశారు.

చాలాసేపు కళా, సాహిత్యం, రాజకీయ చర్చలు గావించాము.

కౌముది బయటకు రాకూడదా? కాఫీకూడా జవాన్ తెచ్చాడు!

ఆఖరికి మనస్సు నిలవక— "మీ శ్రీమతిగారు..." అని రాగం తీశాను.

"ఓహెూ!... మరిచానునుమండి. వాళ్ళ ఊరెళ్ళి నాలుగు రోజులైంది. చూడండి నేనొక్కణ్ణే" అని నవ్వారు.

అలాగైతే నన్ను వెదుక్కొంటూ వచ్చిన ఆ 'అపరిచిత' కౌముదికాదు. అలాగైతే ఎవరామె...?

ఒకప్రక్క నిరాశ, ఇంకోప్రక్క ఉత్సాహం అధికమయింది

దారిలో కూడా అదే యోచన! రూముచేరాను 'హుష్' అంటూ

పనీ పాటా లేని పరమేశం గారు ఒకరోజున తీరుబాటుగా బ్లేడ్ల కంపెనీకి ఒక ఉత్తరం రాశాడు.

"మీ బ్లేడులు నేను మీ కంపెనీ పుట్టిం దగ్గర్నుంచీ వాడుదామని అనుకున్నా, నాకు గడ్డం పుట్టినప్పటి నుంచే వాడుతున్నాను. అయినా అవినాకు చాలా సంతృప్తినిచ్చాయి. మీ బ్లేడుల కన్నా మంచివని పేపర్లో చూసి ఒకటి రెండుసార్లు వేరేరకం బ్లేడులు కొందామని అనిపించింది గాని ఎందుకో అలా చెయ్యలేదు. ఎందుకంటే మీ బ్లేడు చాలా రోజు లొస్తుంది. అంతెందుకు — ఇవాళ నేను గడ్డం చేసుకున్న బ్లేడు నేను ఆర్నెల్ల నుంచీ వాడుతున్నాను, ఇంతకంటే ఏం చెప్పగలను!"

బ్లేడ్ల కంపెనీ వారు అతనికోక పార్సెల్ పంపేరు. ఉత్తరంలో "మీకు ఆర్నెల్లకు సరిపడ్డ బ్లేడులు పంపుతున్నాము" అని వుంది.

పార్సెల్లో ఒక బ్లేడు వుంది.

---

కుర్చీలో కూలబడ్డాను ఒక్కసారి కళ్ళు నులుముకొని తెరవగానే, ఉండలా చుట్టిన ఓ కాగితం ఆకర్షించింది నాదృష్టిని. గబుక్కున లేచి ఠక్కున అందుకొన్నా ఆ చీటీని. మడతలు విప్పి తెరిచాను. ముత్యాలాంటి పదివరుసలు! గుండె దడ... దడ — మంది. చదవసాగాను.

"నారాజా! (ఓ. మైగాడ్)

రెండు దినాలుగా మిమ్మల్ని చూడాలని వచ్చాను. కాని కలవలేదు (ఔను, నాకు తెలుసు) చాలా విసుగనిపించింది (అయ్యో పాపం!) నాపై మీకెందుకంత కోపం? (నాకా?) ఊరికి వచ్చినవారు ఇంటికి రాకుండా హొటల్లో దిగటమా? (మీ ఇంటి అడ్రసు ఎవరికి తెలుసు మహారాణి?) మా నాన్న ఏమైనా అనుకొంటారనా? అలాంటిదేమీ లేదు. వారు చాలా సోషియల్ మెంటాలిటీ గలవారు. మన విషయం ఇప్పుడిప్పుడే సూక్ష్మంగా తెలిపాను. వామాటకు వారెప్పుడూ అడ్డుచెప్పరు. మన పెళ్ళికి తప్పకుండా అంగీకరిస్తారు.

మధ్యాహ్నం రెండింటికి డ్యామ్ దగ్గర వెయిట్ చేస్తుంటాను. తప్పకుండా రావాలి డార్లింగ్.

ఇట్లు
నీ కామిని."

అదృష్టమంటే నాదే అని పించింది. పెళ్ళి అయేదీ, కానిదీ తరు

వాత విషయం. మొదట ఈ చిన్నారి ఎవరో చూడాలి, అనుకొన్నాను.

నాలుగు దినాల తలభారం తొలగి పోయింది. హుషారుగా ఈల వేసుకొంటూ భోజనానికి వెళ్ళాను. మళ్ళీ మావాడు పరిగెత్తుకొచ్చాడు.

"సార్. మరిచిపోయాను."

"మరేం భాగోతం తెచ్చావ్ రా నాయనా" అన్నా నవ్వుతూ.

"ఏంలేదు సార్. ఎవరో రాజీవ్ట మీకోసం వచ్చారు..." అని నిలిపివేసి నా ముఖం పట్టిపట్టి చూస్తూ—

"మొగాడు సార్!" అన్నాడు.

"యూ! ఫూల్! నాకామాత్రం తెలియదనుకొన్నావా?" అన్నా రానికోపంతో, వచ్చే నవ్వాపుకొంటూ. ఈ రాజీవుడెవడు నాయనా? అనుకొన్నా మదిలో. మౌనంగా భోజనం ముగించి, కిళ్ళీ వేసుకుని రూమువైపు బయల్దేరాను. తలుపు దగ్గర ఒక 'అప్ టు డేట్ యంగ్ మాన్' నిలబడ్డాడు. నేరో ప్యాంట్, టెర్లిన్ షర్టు టక్ చేశాడు. టై, పాయింటెడ్ షూస్, నల్లకళ్ళజోడు, షోగ్గా తయారయాడు. నొక్కులజుట్టు ... సందేహంలేదు. కాలేజీ విద్యార్థి అయ్యుండాలి. ఇతనేనా రాజీవ?

"ఎవరు కావాలండీ?" అన్నా సౌమ్యంగా.

"చూడండీ... మీరు ఈ రూము వారేనా" అన్నాడతడు అతి సౌమ్యంగా.

నేను లోపలి కాహ్వానిస్తూ "అవునండీ" అన్నాను.

"అర్రోజులక్రితం నేను ఈ రూములోనే ఉన్నానండీ. ఇప్పుడు వేరే హోటల్లో ఉన్నాను. ఇక్కడ అంత అనుకూలంగా లేదు. ఇక్కడ బాగుండి" అన్నాడు.

"సంతోషం! నాకు ఇక్కడ బాగానే ఉంది!" అన్నాను కళ్ళువిరిచినట్లు. వీడెవడో అధికప్రసంగి అనుకొన్నాను.

"అందుకే కాదండి. ఈ రూము అడ్రసు మావాళ్ళకిచ్చాను. ఎవరయినా వచ్చారా...!" అని రాగాలు పోయాడు.

మొఖం పై కొట్టినట్లైంది.

"ఏమైనా పోస్టు-గీస్టు" అన్నాడు మళ్లా. "పోస్టేమీ లేదు. కాని ఒక చీటీ!" అంటూ జేబునుండి తీసిన వెంటనే ఠక్కున లాక్కున్నాడు. సాంతం చదివేప్పటికి ఆ బ్బాయి మొగం చాటంతయింది.

"ఓ! మైగాడ్...! రెండింటికి డ్యామ్‌దగ్గర!" అంటూ థ్యాంక్సయినా చెప్పకుండా సుడిగాలిలా వెళ్ళిపోయాడు.

ఎందుకో గాని మెదడులో విపరీతమయిన గందరగోళం బయల్దేరింది. మూలనున్న కుర్చీలో కూలబడ్డాను. అప్రయత్నంగా అనాలోచితంగా నానోట ఏవో పదాలు వెలువడ్డాయి.

"ఏమండీ? మీలో మీరే మాట్లాడుతున్నారు?" అన్న రవి పిలుపుతో ఉలిక్కిపడ్డాను.

"సినిమా చూశ్చేదు కదూ? చూస్తావా రవీ? ఏమన్నానేమిటి?" అన్నాను సర్దుకొంటూ.

'అపరిచిత!' □□□